ఆపరేషన్ సిందూర్ విజయం కోసం ర్యాలీ

రాంనగర్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరుతూ టీడీపీ మాజీ కార్పొరేటర్ పలున బాల్‌రాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారత సైన్యానికి మద్దతుగా సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీరాంనగర్ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్, నాయకులు ఉదయ్‌కుమార్‌గుప్తా, సాగర్, రమేష్, సాయి, పుల్లయ్య, యాదగిరి, గోపాల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్ కార్పొరేటర్ ఆధ్వర్యంలో

ఆపరేషన్ సింధూర్‌కు సంఘీభావంగా రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి ఆధ్వర్యంలో శనివారం సంఘీభావ కార్యక్రమం జరిగింది. ఈ యుద్ధానికి భారత సైన్యంకు ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని కోరారు.

మురళీ నాయక్‌కు టీడీపీ నేతల నివాళి

భారత్, పాక్ మధ్య యుద్ధంలో వీరమరణం పొందిన ఏపీకి చెందిన తెలుగుతేజం ముడావత్ మురళీనాయక్‌కు టీడీపీ నగరకమిటీ ఆధ్వర్యంలో శనివారం దోమలగూడలోని పార్టీ కార్యాలయంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా నాయకులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, రాజేంద్రప్రసాద్, పరుశరాం, ఎస్.ప్రకాష్, విజయ్, భానుప్రకాష్; జగదీష్‌గౌడ్, కిరణ్, మల్లికార్జున్, రవి, కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సైనికులు క్షేమంగా ఉండాలని పూజలు

కవాడిగూడ, మే 10 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌పై జరుగుతున్న యుద్ధంలో భారతదేశం విజయం సాధించి, సైనికులు క్షేమంగా ఉండాలని బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి.భరత్‌గౌడ్ ఆకాంక్షించారు. శనివారం లోయర్ ట్యాంక్‌బండ్ బండమైసమ్మనగర్ భారీ శ్రీహనుమాన్ విగ్రహం వద్ద బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం, భారీ శ్రీహనుమాన్ విగ్రహానికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ టి.రవీందర్, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రామ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేశ సైనికుల సేవలు ఆదర్శం : బీఆర్ఎస్

ముషీరాబాద్: పాకిస్తాన్ భారత్ దేశాల మధ్య జరుగుతున్న పోరాటంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన సచిన్‌యాదవ్, మురళీనాయక్ జవాన్ వీరమరణం పొందారని బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని రంగానగర్ కమ్యూనిటీహాల్‌లో జవాన్ సచిన్‌యాదవ్, మురళీనాయక్‌కు నివాళులర్పించి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ ఇన్‌చార్జి దన్‌దయాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు రహీం, డివిజన్ బీసీసెల్ అధ్యక్షుడు ఉమాకాంత్, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్‌అలీ, ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.



కవాడిగూడ బండ మైసమ్మనగర్‌లో హనుమాన్ విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

ఇండియా విజయం సాధిస్తుంది

బర్కత్‌పుర, మే 10 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదం పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ నశించిపోయి ఇండియా విజయం సాధిస్తుందని రజక హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్‌కుమార్ పేర్కొన్నారు. భారత సైన్యం విజయం సాధించాలని కోరుతూ రజక హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మడేలేశ్వర్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బర్కత్‌పుర ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత సైన్యానికి ధైర్యాన్ని ప్రసాదించమని, ఉగ్రవాద ముకలను తుదముట్టించమని పూజల ద్వారా వేడుకున్నామన్నారు. ఆపరేషన్ సింధూర్ దేశచరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.కుమార్, ఆర్.శంకర్, ఆర్.నరేష్; ఎం.నర్సింహులు, పి.శ్రీకాంత్, బాల్‌రాజ్, మధు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



భోలక్‌పూర్‌లో సైనిక అమరవీరులకు సంతాపం తెలుపుతున్న బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, దీన్‌దయాల్‌రెడ్డి తదితరులు



వీరమరణం పొందిన మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు సాయిబాబా తదితరులు



ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా సంఘీభావం తెలుపుతున్న రాంనగర్ కార్పొరేటర్ రవిచారి తదితరులు

13న దివ్యాంగుల సంక్షేమశాఖ డైరెక్టరేట్ ముట్టడి

చిక్కడపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 13న వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) ఆధ్వర్యంలో వికలాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించనున్నారు. ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య శనివారం మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమశాఖను ప్రత్యేకశాఖగా కొనసాగించాలన్నారు. ప్రతి వికలాంగుడికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులను సిబిల్‌స్కోర్ ఆధారంగా ఎంపిక చేస్తామని దరఖాస్తుల ప్రక్రియ పూర్తి అయిన తర్వాత సీఎం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వెంకట్, అడివయ్య పేర్కొన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సిబిల్ స్కోర్ నిబంధనను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు.

సంగీత, నృత్య ప్రదర్శనలకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): శ్రీవాగ్దేవి సంస్కృత భారతి ఆధ్యాత్మిక ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25న ప్రత్యేకపూజా కార్యక్రమాలు, సంగీత విభావరి, నృత్యనీరాజనం నిర్వహించనున్నామని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు నిర్మల అంబికానాథశర్మ, సంధ్య తెలిపారు. ఆసక్తిగల భరతనాట్యం, కూచిపూడి నాట్యగురువులు, సంగీత విద్వాంసులు తమ విద్యార్థులచేత సంగీత, నృత్య ప్రదర్శనలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈనెల 13వ తేదీలోపు 9948332032 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

తెలంగాణ సాధనలో యాదగిరి పాత్ర అమోఘం

చిక్కడపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనోద్యమంలో ఆరూరి యాదగిరి ప్రముఖపాత్ర పోషించారని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ అన్నారు. ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతిచెందిన యాదగిరి సంస్మరణ సమావేశం శనివారం గాంధీనగర్ డివిజన్ వాల్మీకినగర్ బస్తీలో జరిగింది. వినయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో యాదిగిరి ముషీరాబాద్ నియోజకవర్గంలోనే ప్రత్యేక కీలకపాత్ర వహించారని, బస్తీలప్రజలను ప్రత్యేకరాష్ట్ర సాధనోద్యమానికి కార్యోన్ముఖులను చేయడంలో ఎంతో కృషి చేశారన్నారు. యాదగిరి కుటుంబ సభ్యులకు ఆయన తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుక్క యాదగిరి నరసింహ, ఆనంద్‌రావు, బస్తీవాసులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు నాగయ్యకు డాక్టరేట్ ప్రదానం

ముషీరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ విద్యామండలి పరిధిలోని కవాడిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోషియల్ టీచర్‌గా పనిచేస్తున్న నాగయ్యకు డాక్టరేట్ లభించింది. ఉస్మానియా యూనివర్సిటీలోని డిపార్టుమెంట్ ఆఫ్ జాగ్రఫీ నాగయ్యకు గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది. శనివారం ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగయ్య మాట్లాడుతూ... వాటర్ షెడ్డు మేనేజ్‌మెంట్ ఇన్ తెలంగాణ రీజియన్ స్టడీ ఆఫ్ రంగారెడ్డి డిస్టిక్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు గాను ఓయూ గెజిట్ ద్వారా డాక్టరేట్‌ను ప్రదానం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చిన్ననాటి నుంచి అనుకున్న లక్ష్యాన్ని ఛేదించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నానని తెలిపారు. అందువల్లే తనకు ఈ అవార్డు లభించిందని పేర్కొన్నారు. విశ్రాంత ప్రొఫెసర్ బి.లక్ష్మయ్య సహకారంతో తన లక్ష్యం పూర్తి చేసి, ఓయూ నుంచి డాక్టరేట్ పొందానని తెలిపారు. జాగ్రఫీ డిపార్టుమెంట్‌కు చెందిన డాక్టర్ అక్తర్‌అలీ, హెచ్‌వోడీ ప్రొఫెసర్ అనురాధ, ప్రొ.నాగేష్ చేతుల మీదుగా డాక్టరేట్ పొందానని తెలిపారు.

పీవీ.రావుకు నివాళి

నల్లకుంట, మే 10 (ఆంధ్రజ్యోతి): అణగారిన కులాలు రాజ్యాధికారం సాధించడమే మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత పీవీ.రావు ఆశయం అని పలువురు నేతలు పేర్కొన్నారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత పీవీ.రావు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ.రావు చిత్రపటానికి మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ, నేషనల్ అంబేడ్కర్ సేన జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తాలుకా రాజేష పూలమాలలు వేసి నివాళులర్పించారు. అణచివేత, కుల వివక్షతకు గురైన ప్రజలు పాలకులుగా మారడమే పీవీ.రావు లక్ష్యమని, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయడమే నిజమైన నివాళులని వారన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు తలారి సురేష్, వీరన్న, శంకర్, శ్రీనివాస్, రవి, ఎల్. గిరిజాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

నల్లకుంట, మే 10 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం డివిజన్‌లోని సాయిమధురానగర్‌లో రూ.22 లక్షల వ్యయంతో నూతన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించి, మాట్లాడారు. డివిజన్‌లో సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్.చంద్రమోహన్, నాయకులు మోర శ్రీరాములు ముదిరాజ్, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ముషీరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ సిద్ధిక్‌నగర్, బంగ్లాదేశ్ మార్కెట్ వీధిలో డ్రైనేజీ పైప్‌లైన్ అనంతరం రోడ్డు పనులు చేపట్టాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.అరవింద్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని సిద్ధిక్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి అరవింద్ కుమార్‌యాదవ్ పర్యటించారు. అరవింద్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ... బంగ్లాదేశ్ మార్కెట్ వీధి, సిద్ధిక్‌నగర్, సందానివీధిలో డ్రైనేజీ పైప్‌లైన్‌లు అస్తవ్యస్తంగా మారడంతో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ రూ.10.50లక్షలు నిధులు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సయ్యద్ మసూద్, నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ సంగీత కచేరి

చిక్కడపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో జరిగిన శాస్త్రీయ సంగీత కచేరి ఆకట్టుకుంది. సుబ్రహ్మణ్య సూర్యకాంతపుత్ర డా.పుచ్చా వెంకటరామశాస్త్రి అంబావిలాసం శాస్త్రీయ సంగీత కచేరిని నిర్వహించి, అందరినీ అలరించారు. పలు ఆధ్యాత్మిక గీతాలను ఆయన పాడి వినిపించారు. సంస్థ వ్యవస్థాపకుడు కిన్నెర రఘురామ్ వెంకటరామశాస్త్రిని సత్కరించారు.

పెళ్లి కావడం లేదని ఆటోడ్రైవర్ ఆత్మహత్య

కవాడిగూడ, మే 10 (ఆంధ్రజ్యోతి): పెళ్లికావడం లేదని ఓ టాటాఏసీ ఆటో డ్రైవర్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గాంధీనగర్ పీఎస్ పరిధిలోని ఉన్నికోట సమీపంలో శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గాంధీనగర్ ఎస్‌ఐ నర్సింహ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... ఉన్నికోట సమీపంలో ఉండే గోపగోని మీనయ్య, యాదమ్మకు ముగ్గురు ఆడపిల్లలు, కుమారుడు గోపగోని నరేష్(33). ఆడపిల్లల వివాహం కాగా నరేష్ వివాహం కాలేదు. వృత్తిరీత్యా నరేష్ టాటా ఏసీ ఆటో డ్రైవర్. తనకంటే చిన్నవారికి పెళ్లిళ్లు అవుతున్నాయని తనకు కావడం లేదని కొంతకాలంగా కుటుంబసభ్యులతో గొడవపడుతున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం తల్లిదండ్రులు పనులకు వెళ్లారు. మధ్యాహ్నం 3 మూడు గంటల ప్రాంతంలో భోజనానికి వచ్చిన కుటుంబ సభ్యులకు లోపలి నుంచి గడియపెట్టుకొని కనిపించింది. ఎంతతట్టినా తలుపు తీయలేదు. దీంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తలుపు పగలగొట్టి చూడగా నరేష్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని కనిపించాడు. గాంధీనగర్ పోలీసులకు సమాచారం అందించగా ఎస్‌ఐ నరసింహ వచ్చి, క్లూస్‌టీంతో వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పెళ్లికావడం లేదని తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలపారు.

సీఆర్‌పీఎఫ్ జవాన్ సెల్‌ఫోన్, ఐడీకార్డు చోరీ

బర్కత్‌పుర, మే 10 (ఆంధ్రజ్యోతి): సీఆర్‌పీఎఫ్ జవాన్ సెల్‌ఫోన్, ఐడీకార్డును రైలులో దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివాని హజ్రత్ నిజాముద్దీన్‌లో కాచిగూడకు రావడానికి కర్నాటక సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. నాగపూర్ సమీపంలో చార్జింగ్‌పెట్టిన సెల్‌ఫోన్‌లో ఉన్న ఐడీ కార్డును దొంగలు తస్కరించారు. శనివారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో శివాని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం మహారాష్ట్రలోని వార్ధ రైల్వేపీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

అంబర్‌పేట, మే 10 (ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పారిశుధ్య కార్మికులు లక్ష్మీయాదయ్య దంపతులకు చెన్నారెడ్డినగర్ ప్రజా సంక్షేమ సంఘం సభ్యులు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు నవీన్‌రెడ్డి మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా లక్ష్మీయాదయ్య దంపతులు ఒకే ప్రాంతంలో చెత్తను సేకరిస్తూ బస్తీవాసుల మన్ననలను పొందారని పేర్కొన్నారు. బస్తీలో ఎలాంటి ఆరోగ్య సమస్యలూ తలెత్తకుండా ఎప్పటికప్పుడు చెత్త తొలగించి, బస్తీని శుభ్రంగా ఉంచారని అభినందించారు. ఈ కార్యక్రమంలో వెంకటస్వామిగౌడ్, లక్ష్మయ్య, మల్లారెడ్డి, భగవంతు, నరేష్, సునీత, భూదేవి తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి కృషి: కార్పొరేటర్

నల్లకుంట, మే 10 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ యాకర అమృత పేర్కొన్నారు. శనివారం నల్లకుంటలోని డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ త్వరలో డివిజన్‌లో నూతన సీసీ రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ పైప్‌లైన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీలలో స్థానిక సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు.

బీఆర్ఎస్‌ను బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలి

చిక్కడపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌ను బూత్‌స్థాయి నుంచి పటిష్టం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు కొండపల్లి మాధవ్ సూచించారు. గాంధీనగర్ బీఆర్ఎస్ డివిజన్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం పార్టీ డివిజన్ అధ్యక్షుడు ముడారపు రాకేష్‌కుమార్ అధ్యక్షతన శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగింది.

డబ్ల్యూసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రావణ్

ముషీరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ క్రిష్టియన్ కౌన్సిల్ (డబ్ల్యూసీసీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముషీరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గండి శ్రావణ్ నియమితులయ్యారు. ఆయనకు శనివారం డబ్ల్యూసీసీ జాతీయ అధ్యక్షుడు రఘుముద్రి పీటర్‌నాయుడు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రావణ్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... క్రైస్తవులపై దేశవ్యాప్తంగా జరుగుతున్న దాడులను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంకితభావంతో కృషిచేయాలని డిమాండ్ చేశారు.



లక్ష్మీకృష్ణను జీవితసాఫల్య పురస్కారంతో సత్కరిస్తున్న అతిథులు

లక్ష్మీకృష్ణకు జీవితసాఫల్య పురస్కారం

చిక్కడపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత విద్వాంసురాలు, విశ్వవాణి మ్యూజిక్ అకాడమీ, అన్నమయ్య అమృతవాణి సంస్థల వ్యవస్థాపక కార్యదర్శి ములకలూరి లక్ష్మీకృష్ణకు జీవితసాఫల్య పురస్కారం బహూకరించారు. తాళ్లపాక అన్నమాచార్య జయంతిని పురస్కరించుకుని శ్రీకమలాకర చారిటబుల్ ట్రస్టు, కమలాకర లలిత కళాభారతి ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న చారిత్రక నవలాచక్రవర్తి ఆచార్య ముదిగొండ శివప్రసాద్, సంగీత దర్శకులు బి. ఉదయకుమార్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక సంగీత విద్వాంసురాలు లక్ష్మీకృష్ణను సత్కరించి ఉత్తమ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య టి.గౌరీశంకర్, ముక్తేవి భారతి, అనంతలక్ష్మి, భారతీకమలాకర్, లలితాపరమేశ్వరి, కృష్ణవేణి పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా కలుషిత నీరు సరఫరా

నల్లకుంట, మే 10 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్ బస్తీలో గత నాలుగు నెలలుగా కలుషిత నీరు సరఫరా అవుతున్నా, జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీంతో బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తిలక్‌నగర్‌లోని ఇంటి నెంబర్ 2-2-1107/1 నుంచి 2-2-1107/40 వరకు ఈ వీధిలో నాలుగు నెలల నుంచి మంచినీటి సరఫరాలో కలుషిత నీరు వస్తుందన్నారు. ఈ మేరకు శనివారం బస్తీ మహిళలు లక్ష్మీబాయి, లలిత, యశోద, సత్యమ్మ, స్థానికులు బాల్‌రామ్, ఆనంద్, శ్రీనివాస్, బత్తుల రవి, కల్యాణ్‌లు మంచినీటి సరఫరా సమయంలో గంటపాటు కలుషిత నీరు వస్తున్న వైనంపై బాటిళ్లు, బకెట్లలో నింపి చూపించారు.

గుండెపోటుతో టీపీసీసీ కార్యదర్శి గోపాల్ యాదవ్ మృతి



బర్కత్‌పుర, మే 10 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ చప్పల్‌బజార్‌కి చెందిన టీపీసీసీ సంయుక్త కార్యదర్శి సూలం గోపాల్‌యాదవ్(70) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీలో పలు పదవులను సమర్థవంతంగా నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు అంబర్‌పేట హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. గోపాల్‌యాదవ్ మృతికి పలువురు సంతాపం తెలిపారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు, టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, యువజన కాంగ్రెస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎడ్ల అభిజిత్‌యాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సి.వినోద్‌యాదవ్, రాష్ట్రకార్యవర్గ సభ్యుడు సి.నందకిషోర్ యాదవ్, సంతాపం తెలిపారు.